1857.. సిపాయిల తిరుగుబాటు

ఆంగ్లేయులపై భారతీయుల్లో ఎంతోకాలంగా పేరుకుపోయిన అసంతృప్తి 1857లో సిపాయిల తిరుగుబాటుకు దారితీసింది. దీనికి సరైన దిశానిర్దేశం లేకపోవడంతో సాధారణ తిరుగుబాటుగానే మిగిలిపోయింది. దాంతో ఆంగ్లేయులు మరింత జాగ్రత్తపడి భారతదేశాన్ని దాదాపు మరో వందేళ్లు పాలించగలిగారు.



1757లో ప్లాసీ యుద్ధంతో భారత్‌లో ఆంగ్లేయుల పాలన మొదలైంది. ఆ తర్వాత సరిగ్గా వందేళ్లకు, అంటే.. 1857లో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఇది అకస్మాత్తుగా ఒక్క రోజులో సంభవించలేదు. వందేళ్లపాటు భారతీయుల్లో గూడు కట్టుకున్న అసంతృప్తి 1857లో సిపాయిల తిరుగుబాటుకు కారణమైంది. అయోధ్య నవాబు వాజిద్ అలీషాకు పన్నెండు మంది సంతానం. రాజ్యసంక్రమణ సిద్ధాంతాన్ని అనుసరించి అతని రాజ్యాన్ని లాక్కోవడానికి డల్హౌసీకి కుదరదు. సంతానం లేకపోతేనే సంస్థానాన్ని ఆక్రమించుకోవడానికి వీలవుతుంది. దాంతో నవాబు పాలన సరిగా లేదంటూ.. అయోధ్యను లాగేసుకున్నాడు. ఇది దేశంలో తీవ్ర విమర్శలకు దారితీసింది. పారిశ్రామిక విప్లవం వల్ల లండన్‌లో తయారైన తమ వస్త్రాలను అయోధ్యలో అమ్ముకోవచ్చనేది బ్రిటిషర్ల ఎత్తుగడ. అప్పట్లో వాళ్లు అయోధ్యను Milk cow (పాడి ఆవు) అని పిలిచేవారు. బీరార్‌ను ముడిపత్తి ఎగుమతికి, అయోధ్యను వస్త్రాలను విక్రయించుకునేందుకు వీలుగా మలచుకున్నారు. అందుకే డల్హౌసీ 1856లో అయోధ్యను బలవంతంగా ఆక్రమించాడు.

సగానికి పైగా అయోధ్య వాసులే...

బిటిష్ సైన్యంలో పనిచేసే భారతీయ సిపాయిల్లో ఒక్క అయోధ్య నుంచే సగానికి పైగా ఉన్నారు. డల్హౌసీ అయోధ్యను ఆక్రమించడం వీరికి ఎంతమాత్రం ఇష్టం లేదు. పైగా ఆంగ్లేయులు ఆ ప్రాంతంలో శిస్తును విపరీతంగా పెంచేశారు. దాంతో అయోధ్య ప్రజలు శిస్తును భరించలేక, సిపాయిల తిరుగుబాటుకు మద్దతుగా నిలిచారు.

మంగళ్ పాండే ప్రేరణ:

1857 సిపాయిల తిరుగుబాటుకు కేంద్రం ఢిల్లీ. 1857 మే 10న మీరట్‌లో తిరుగుబాటు మొదలైంది. ఈ తిరుగుబాటుకు తొలి ప్రేరణ 1857, ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్‌లోని బరక్‌పూర్‌లో మంగళ్ పాండే ద్వారా జరిగింది. మంగళ్ పాండే, ఈశ్వర్ పాండే బ్రాహ్మణులు. వీరిద్దరూ బరక్‌పూర్ రెజిమెంట్‌లో సిపాయిలు. మత ఆచార వ్యవహారాలను పాటించేవారు. అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ కానింగ్.. కొత్తగా తుపాకులను తెచ్చాడని, వాటిని ఎన్‌ఫీల్డ్ రైఫిల్స్ అని పిలుస్తారని, అవి ప్రయోగించాలంటే తప్పనిసరిగా నోటితో కొరకాలని, వాటికి ఆవు కొవ్వు, పందికొవ్వు రాసి ఉంటుందనే ప్రచారం జరిగింది. ఆవు హిందువులకు పవిత్రం. పంది ముస్లింలకు అపవిత్రం. తమ మనోభావాలను గాయపరిచేందుకే ఆంగ్లేయులు ఆ పని చేశారని భారతీయ సిపాయిలు తలిచారు. తిరుగుబాటు వేగవంతం అవడానికి ఇది కూడా ఒక కారణం!

సముద్రయానం:

కానింగ్ కాలంలోనే జనరల్ సర్వీస్ ఎన్‌లిస్ట్‌మెంట్ చట్టం వచ్చింది. దాన్ని సామాన్య సేనాని యుక్త చట్టమంటారు. దీన్ని అనుసరించి భారతీయ సిపాయిలు సముద్రం దాటి విదేశాల్లో యుద్ధాలకు వెళ్లి తీరాలి. అయితే హిందువుల మతాచారం ప్రకారం సముద్రయానం చేయకూడదు. అలా చేస్తే, విదేశీ సంస్కృతులకులోనై భారతీయ సంస్కృతికి చెరుపు జరుగుతుందని నమ్మేవారు. దాంతో హిందూ సిపాయిలు విదేశాలకు వెళ్లడానికి నిరాకరించారు. కానీ, చట్టం ప్రకారం తప్పనిసరిగా విదేశాలకు వెళ్లి పోరాడాలి. ఇది నచ్చని భారత సిపాయిలు తిరుగుబాటుకు సన్నద్ధమయ్యారు.

జోక్యం పెరిగిపోవడం:

1857 సిపాయిల తిరుగుబాటుకు మరికొన్ని బలమైన కారణాలు కూడా ఉన్నాయి. సతీసహగమన నిషేధం (1829), బాల్యవివాహాల నిషేధం, ఆంగ్ల విద్య ప్రవేశపెట్టడం (1835), వితంతు పునర్వివాహ చట్టం (1856) వంటివి సంప్రదాయవాదులకు నచ్చలేదు. వందల ఏళ్లుగా భారతీయ సంస్కృతిలో కొనసాగుతున్న ఆచార వ్యవహారాల్లో ఆంగ్లేయుల జోక్యం పెరిగిపోవడాన్ని భారతీయులు జీర్ణం చేసుకోలేకపోయారు. ఒక విధంగా తమ సంస్కృతిని కాపాడు కోవటానికి జరిగిన తిరుగుబాటుగా కూడా చెప్పవచ్చు.

మణికర్ణిక- ఝాన్సీలక్ష్మీభాయి:

1857 సిపాయిల తిరుగుబాటులో మణికర్ణికది కీలక భూమిక. ఆమెను

'క్వీన్ ఆఫ్ 1857 రివోల్ట్' అని పిలుస్తారు. ఝాన్సీలక్ష్మీ బాయి అసలు పేరు మణికర్ణిక. ఈమెకు సంతానం లేదు. దాంతో ఆమె సంస్థానం ఝాన్సీని ఆక్రమించుకోవాలని తలపోసిన డల్హౌసీ... అందుకోసం 'రోజ్' అనే స్పెషల్ కమిషనర్‌ని వినియోగించాడు. రోజ్‌కి, ఝాన్సీ రాణికి మధ్య యుద్ధం జరిగింది. ఇక్కడ ఝాన్సీలక్ష్మీభాయి మరణించడాన్ని 'జుగన్‌బాగ్ హత్యాకాండ' అంటారు. 'ఆంగ్లేయులు భారత దేశంలో స్పాంజి విసిరి.. అది పీల్చుకున్న సంపదను, ఇంగ్లండ్‌లోని థేమ్స్ నది ఒడ్డున పిండుతున్నారు' అని భారతీయ చరిత్రకారుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఇది అక్షర సత్యం!

బలహీన బహదూర్ షా:

1857 సిపాయిల తిరుగుబాటు నాటికి మొగల్ సామ్రాజ్యం ఉంది. అయితే, అది ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న దీపం. చివరి మొగల్ నవాబు బహదూర్‌షా-2 ఎర్రకోటను వదిలిపెట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ స్థితిలో.. అనూహ్య రీతిలో.. తన 70వ ఏట బహదూర్ షా-2 సిపాయిల తిరుగుబాటుకు నాయకత్వం వహించాల్సి వచ్చింది. అప్పట్లో ఆయన వద్ద ఢిల్లీలో ప్రధాన మొగల్ సైన్యాధికారిగా జనరల్ భక్త్‌ఖాన్ ఉన్నాడు. ఇతను ఆంగ్లేయుల నికల్సన్‌తో తలపడ్డాడు. జనరల్ భక్త్‌ఖాన్ మరణించగా, నికల్సన్ విజయానంతరం మృతి చెందాడు. సిపాయిల తిరుగుబాటుని ఆంగ్లేయులు సవాలుగా తీసుకున్నారు. లక్షల సంఖ్యలో ఆంగ్ల సైన్యాన్ని రప్పించారు. తాము వేసిన రైలు, రోడ్డుమార్గాల ద్వారా సిపాయిల తిరుగుబాటును దారుణంగా అణిచివేశారు. వందలాది మందిని చెట్లకు కట్టి ఉరి తీశారు.

క్రూరత్వంలో రష్యా జార్‌లను మించిపోయారు. తిరుగుబాటు దేశంలోని అన్ని ప్రాంతాలలో జరిగినట్లయితే.. 1857లోనే ఆంగ్లేయులు భారత్‌ను వదిలి వెళ్లిపోయేవారు. చాలామంది సంస్థానాధీశులు- ముఖ్యంగా సిక్కులు, రాజపుత్రులు ఆంగ్లేయులకు సహకరించారు. సిక్కుల ఐదో గురువుని రాజకీయ కారణాల వల్ల జహంగీర్ చంపగా, తొమ్మిదో గురువు తేజ్ బహదూర్‌ను ఔరంగజేబు చంపాడు. సిక్కుల రాజకీయ నాయకుడైన బందాబహదూర్ (లక్ష్మణ్‌దాస్)ను మొగల్ రాజు ఫరూఖ్‌సియర్ చంపించాడు. దాంతో సిక్కులు మొగలులపై విరోధం ప్రకటించారు. సిపాయిల తిరుగుబాటుకు బహదూర్‌షా నాయకత్వం వహించడంతో సిక్కులు ఆంగ్లేయుల పక్షం వహించేట్లు చేశాయి.

ప్రథమస్వాతంత్ర్య సంగ్రామం:

1857 సిపాయిల తిరుగుబాటును భారతీయులు, ముఖ్యంగా వి.డి. సావర్కర్ 'ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం' అని పేర్కొనగా... ఆంగ్లేయులు దీన్ని సిపాయిల తిరుగుబాటుగా కొట్టి పారేశారు. వృద్ధాప్యాన్ని సైతం లెక్క చేయకుండా పోరాడిన బీహార్‌లోని జగదీష్‌పూర్‌కి చెందిన కున్వర్‌సింగ్.. అయోధ్య రాణి బేగమ్ హజ్రత్ మహల్. కాన్పూర్ నుంచి నానా సాహెబ్.. గ్వాలియర్‌కు చెందిన తాంతియా తోపే.. సిపాయిల తిరుగుబాటులో నాయకులుగా పేరు పొందారు. వీరంతా వీర పోరాటాలు చేశారు. తాంతియా తోపేని బ్రిటిష్‌వారు ఉరితీశారు. నానా సాహెబ్ కాన్పూర్ నుంచి పోరాటం చేసి, నేపాల్ అడవుల్లోకి వెళ్లిపోయి మరణించాడు!!